క్లుప్తంగా

సీఐలుగా శ్రీనివాసరావు, అనూరాధ బాధ్యతల స్వీకరణ



శ్రీనివాసరావు



జె.అనురాధ

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని ఎస్సీ, ఎస్టీ సెల్ విభాగం సీఐగా కుమ్మరి శ్రీనివాస రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 2009లో ఎస్ఐగా చేరారు. చందోలు, క్రోసూరు, బెల్లంకొండ, వినుకొండ టౌన్, తుళ్లూరు, బాపట్ల మెరైన్, కొత్తపేట, నల్లపాడు పోలీస్‌స్టేషన్లల్లో ఎస్ఐగా విధులు నిర్వహించారు. ఈనెల 14న గుంటూరు రేంజ్‌లో పలువురు ఎస్ఐలకు సీఐలుగా ఉద్యోగోన్నతి కల్పించగా, అందులో కుమ్మరి శ్రీనివాసరావు ఉన్నారు.

■ జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని జిల్లా క్రైం రికార్డ్స్ బ్యూరో (డీసీఆర్‌బీ) సీఐగా జె. అనూరాధ శనివారం బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఆమె మేడికొండూరు, తాడికొండ, కొత్తపేట, పెదకాకాని, దిశ గుంటూరు, డీసీఆర్‌బీ, అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌ల్లో ఎస్ఐగా విధులు నిర్వహించారు. ఇటీవల అనూరాధ సీఐగా ఉద్యోగోన్నతి పొందారు.

పీహెచ్‌సీకి వాటర్ కూలర్ బహూకరణ



డాక్టర్ మన్మోహన్‌కు వాటర్ కూలర్ అందజేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

గుంటూరు మెడికల్: రవి హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వాటర్ కూలర్ బహూకరించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల దాహార్తిని తీర్చేందుకు ప్రముఖ న్యూరో సర్జన్, రవి హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ బీజాపూరి చంద్రశేఖర్ శనివారం డీపీఎంవో డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్‌కు కూలర్ అందజేశారు.

వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు కృషి

జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు మస్తాన్

లక్ష్మీపురం: వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు రాష్ట్ర ప్రత్యేక అధికారి షేక్ షిరిన్ బేగ్ సహకారంతో కృషి చేస్తామని గుంటూరు జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు మస్తాన్ తెలిపారు. నగరంపాలెంలోని కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ బోర్డుకు రెడ్డిపాలెంలో 187 ఎకరాలు, కాకాని రోడ్డు నిర్కిస్ సొసైటీలో 78 ఎకరాలు, పొన్నూరు రోడ్డులో గల షాబా మజీద్ దర్గాలో ఏడు ఎకరాలు.. ఇలా జిల్లావ్యాప్తంగా వేల కోట్ల రూపాయల ఆస్తులున్నాయని గుర్తు చేశారు. వాటిలో ఇప్పటికే కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆక్రమణకు గురయ్యాయని ఆరోపించారు. వాటిని ఇప్పుడు గుర్తించి, వక్ఫ్ బోర్డు కమిటీ సభ్యుల సహకారంతో త్వరలో అధికారుల దృష్టికి తీసుకెళతామని తెలిపారు. ఆస్తుల స్వాధీనం చేసుకుని ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. కాకాని రోడ్డులో గల నిర్కిస్ సొసైటీ 78 ఎకరాల్లో చాలా వరకు ఆక్రమణకు గురైందన్నారు. రాష్ట్ర వక్ఫ్ అధికారి షిరిన్ బేగ్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి ఆక్రమణకు గురైన ఆస్తుల్ని తిరిగి స్వాధీనం చేసుకోనులా ప్రణాళికలు రూపొందించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



డ్యాన్స్‌లతో హుషారెత్తిస్తున్న విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా కళాశాలలో శనివారం డిగ్రీలో కొత్తగా చేరిన విద్యార్థినులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ, ఆధునిక వస్త్రధారణలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల డైరెక్టర్ బీఎస్సార్కే ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థినులంతా భవిష్యత్ ప్రణాళికల్ని సమర్థంగా నిర్దేశించుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని చెప్పారు. ఈ సందర్భంగా జూనియర్లకు స్వాగతం పలుకుతూ సీనియర్ విద్యార్థినులు డ్యాన్స్‌లతో హోరెత్తించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి. రోహిణీదేవి, దీప్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సాంకేతిక సవాళ్ల పరిష్కారానికి హ్యాక్‌థాన్‌లు చక్కని వేదికలు

పెదకాకాని: సాంకేతిక సవాళ్ల పరిష్కారానికి హ్యాక్‌థాన్‌లు చక్కని వేదికలని వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ పేర్కొన్నారు. కళాశాలలో యూనివర్సిటీ ఇన్నోవేషన్ ఫెలోస్, ఐఈసీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులుగా 24 గంటలు నిర్విరామంగా నిర్వహించిన డిజైన్ వెంచర్ హ్యాక్‌థాన్ శనివారం ఘనంగా ముగిసింది. ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ హాజరై విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

నగరంలో ఆహ్లాదకర వాతావరణమే లక్ష్యం



బ్రాడీపేట పార్కులో జిమ్ పరికరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, మేయర్ కావటి మనోహరనాయుడు

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, నగర మేయర్ కావటి, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

నెహ్రూనగర్: నగరంలో ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చదనం పెంపునకు పలు పార్కుల్ని అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ తెలిపారు. రూ. 25 లక్షలతో అభివృద్ధి చేసిన బ్రాడీపేటలోని మున్సిపల్ కార్పొరేషన్ పార్కు(టంగుటూరి ప్రకాశం పంతులు నగర పాలక సంస్థ పార్కు)ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ గుంటూరు నగరంలో అభివృద్ధి పనులు పార్టీలకతీతంగా జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా నగర పాలక సంస్థలో నూతన పాలక వర్గం ఏర్పడ్డాక అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. పార్కుల ఏర్పాటు వల్ల ప్రజలు వాకింగ్, అవుట్ డోర్ జిమ్‌లు చేసి ఆరోగ్యాల్ని మెరుగుపరచుకుంటారని చెప్పారు. నగరంలో పచ్చదనం పెంపు వల్ల ప్రజలకు స్వచ్ఛమైన ఆక్సిజన్‌ని అందించవచ్చని తెలిపారు. నగరపాలక సంస్థ కూడా పార్కుల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపడం అభినందనీయమని పేర్కొన్నారు. మేయర్ కావటి మాట్లాడుతూ నగరంలో పచ్చదనం పెంపునకు, ఆహ్లాదకరమైన వాతావరణంలో స్థానిక ప్రజలు నివసించేలా పార్కుల్ని ఆధునిక హంగులతో అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. బ్రాడీపేట పార్కును స్థానికులకు ఎంతగానో ఉపయోగపడేలా, ఆహ్లాదం, ఆరోగ్యం అందించేలా అభివృద్ధి చేశామని వివరించారు. నగర సమగ్ర అభివృద్ధి అంటే రోడ్లు, కాలువల నిర్మాణమే కాదని, పచ్చదనం పెంపు కూడా అందులో భాగమేనని తెలిపారు. ఇప్పటికే నగరంలోని అనేక పార్కుల్ని ఆధునిక హంగులతో అభివృద్ధి చేశామని తెలిపారు. వీటితో పాటుఉ నగరంలో అవసరమైన ప్రాంతాల్లో మౌలిక సదుపాయల్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా నగరంలోని 57 వార్డులను మోడల్‌గా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే గిరి మాట్లాడుతూ గుంటూరు నగరంలో 2014 నుంచి 2019 వరకు ఎటువంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. నగరంలో పార్కుల అభివృద్ధే కాకుండా రోడ్లు, డ్రైన్లు, శ్మశానాలను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. కాలనీల్లో పార్కుల్ని అభివృద్ధి చేయడానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని, దాని ప్రకారం అభివృద్ధి పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. తొలుత నేతలు శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. పార్క్ ప్రధాన ద్వారాన్ని, ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. అనంతరం నాయకులు ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ, బూసి రాజలత, ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ రఫిక్, ఏడీహెచ్ రామారావు, సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

పార్టీని నమ్ముకున్న వారికి గుర్తింపు



సతీష్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, మేయర్ మనోహర్

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: విలక్షణమైన రాజకీయాలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిలయమని, పార్టీని నమ్ముకున్న వారికి తగిన సమయంలో కచ్చితంగా గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. మిర్చి యార్డు డైరెక్టర్‌గా నియమితులైన కొత్తపేటకు చెందిన మల్లెమూడి సతీష్ కుమార్ అభినందన సభను శనివారం అరండల్ పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో నిర్వహించారు. సోల్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అప్పిరెడ్డి మాట్లాడుతూ ధనం, కులం, వారసత్వ రాజకీయాలకు అతీతంగా కష్టపడి పనిచేసే వారిని పార్టీ కచ్చితంగా గుర్తించి వారికి సరైన సమయంలో తప్పక సముచిత స్థానం కల్పిస్తుందని తెలిపారు. ఇందుకు మిర్చి యార్డు డైరెక్టర్‌గా మల్లెమూడి సతీష్ నియామకమే చక్కని నిదర్శనమని స్పష్టం చేశారు. ప్రభుత్వం కట్టబెట్టిన పదవిని అలంకారప్రాయంగా కాకుండా బాధ్యతగా స్వీకరించి మరింత చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వ ఉద్యోగం వదులుకుని పార్టీపై అంకితభావం, చిత్తశుద్ధితో పని చేస్తున్న సతీష్‌కు మరింత ఉజ్వలమైన రాజకీయ భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. సీఎం వై.ఎస్. జగన్ అమలు చేస్తున్న పథకాలు, చేపడుతున్న కార్యక్రమాలన్నీ సమాజంలో స్పష్టమైన మార్పు తీసుకురావాలన్న సదుద్దేశంతో జరుగుతున్నవేనని తెలిపారు. కులం, మతం, ప్రాంతం చూడకుండా పేదరిక నిర్మూలనే ప్రధాన ధ్యేయంగా సీఎం అన్ని వర్గాల ప్రజలకు అర్హతే ప్రామాణికంగా ఆర్థిక లబ్ధి చేకూర్చుతున్నట్లు పేర్కొన్నారు. ఇది సహించలేని పెత్తందారీ పోకడల పార్టీలన్నీ ఏకమై పేదల పక్షాన నిలబడిన సీఎం జగన్‌ను ఓడించేందుకు విషం చిమ్ముతున్నారని విమర్శించారు. మంచి జరిగిందని భావిస్తేనే తనకు ఓటేయండని దమ్ము, ధైర్యంతో ప్రజలకు పిలుపునిచ్చిన ఏకైక నాయకుడు వై.ఎస్. జగన్ అని పేర్కొన్నారు. నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ కష్టపడి పనిచేసిన వారికి, కష్టకాలంలో వెన్నంటి నిలిచిన వారికి పార్టీలో తగిన గుర్తింపు, గౌరవం తప్పక లభిస్తాయని తెలిపారు. తూర్పు నియోజకవర్గ నాయకురాలు నూరి ఫాతిమా మాట్లాడుతూ ఏ పార్టీలో లేని విధంగా సామాన్య కార్యకర్తలకు సైతం పెద్దపీట వేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీకి దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్లు శ్రీవల్లి, బూసి రాజలత, ఈచంపాటి వెంకటకృష్ణ,, అచ్చాల వెంకటరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, రాజేష్, సోల్స్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి మాదాసు జైప్రకాష్, గనిక ఝాన్సీ, మాదాసు కిరణ్, ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఝాన్సీ, గ్రంథాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

స్టేడియంలో వాకర్స్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు

అధికారులకు ఎమ్మెల్యే ముస్తఫా ఆదేశం

నెహ్రూనగర్: బీఆర్ స్టేడియంలో వాకర్స్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా అధికారుల్ని ఆదేశించారు. ఆయన శనివారం స్టేడియంలో ఎమ్మెల్యే పర్యటించారు. ముందుగా వాకర్స్, ప్లేయర్స్‌తో కాసేపు ముచ్చటించారు. స్టేడియంలో సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేడియంలో వ్యర్థాల్ని త్వరితగతిన తొలగించాలని అధికారులకు సూచించారు.

రోడ్డుకు మరమ్మతులు

గుంతలమయంగా ఉన్న పొన్నూరు రోడ్డుకు ఎమ్మెల్యే ముస్తఫా దగ్గరుండి మరమ్మతులు చేయించారు.



స్టేడియంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

ప్రశాంతంగా ముగిసిన
పంచాయతీ ఉప ఎన్నికలు

- పోలీసుల విస్తృత బందోబస్తు
- స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగం

ప్రత్తిపాడు:గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో 2వ వార్డుకు, పెదనందిపాడు మండలం వరగానిలో 8వ వార్డుకు, రావిపాడులో 8వ వార్డుకు, అబ్బినేనిగుంటపాలెంలో 4వ వార్డుకు శనివారం ఎన్నికలు జరిగాయి. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ కొనసాగింది. ఓటర్లు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఓటు వేసేందుకు వచ్చిన వయో వృద్ధుల్ని పోలీసులు, స్థానికులు వీల్ చైర్లలో పోలింగ్ బూత్ వద్దకు మోసుకుని తీసుకువెళ్లారు. గొట్టిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని గుంటూరు ఆర్డీవో ప్రభాకర్‌రెడ్డి, తహసీల్దార్ సిద్దార్థతో కలసి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో తీసుకోవలసిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ ప్రక్రియను వీడియో తీయించకపోవడంపై సంబంధింత అధికారుల్ని ప్రశ్నించారు. అప్పటికప్పుడు వీడియోగ్రాఫర్‌ను పిలిపించి చిత్రీకరించారు. పోలింగ్ కేంద్రం వద్ద అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకున్నారు. సౌత్‌జోన్ డీఎస్పీ మహబూబ్ బాష పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తును పర్యవేక్షించారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టారు. ఎంపీడీవో ఏ. శ్రీరమ్య, ఈవోపీఆర్డీ మావులూరి మోషె, రూట్, జోనల్ ఆఫీసర్లు సీహెచ్. రమాదేవి, లీలారాణి ఓట్ల లెక్కింపును పర్యవేక్షించారు. లెక్కింపు పూర్తయిన తరువాత ఎన్నికల అధికారులు ఫలితాలను ప్రకటించారు. అనంతరం పోలీస్ బందోబస్తు మధ్య బ్యాలెట్ బాక్సులను గొట్టిపాడు నుంచి ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయానికి తరలించారు.



గొట్టిపాడులో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రం వేచిఉన్న మహిళలు



వీల్‌చైర్‌పై గొట్టిపాడు పోలింగ్ స్టేషనుకు వృద్ధుడిని తీసుకువెళుతున్న కానిస్టేబుల్

విజేతల వివరాలు..

- గొట్టిపాడు 2వ వార్డులో గుంటుపల్లి ఈశ్వరప్రసాద్ 78 ఓట్ల మెజారిటీతో సమీప ప్రత్యర్థి నిమ్మగడ్డ శ్రీకాంత్‌పై గెలుపొందారు. ఆయనకు 169 ఓట్లు, నిమ్మగడ్డ శ్రీకాంత్‌కు 91 ఓట్లు, గుంటుపల్లి సాంబశివరావుకు 6, నోటాకు 1, చెల్లని ఓట్లు 2 పోలయ్యాయి.
- రావిపాడు 8వ వార్డులో మహంకాళి పావని 29 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆమెకు 83, వెనిగెర్ల చెంచులక్ష్మికి 54 ఓట్లు వచ్చాయి. ఒకటి చెల్లలేదు.
- ఏబీపాలెంలో మదమంచి వేణుబాబు 124 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఆయనకు 134 ఓట్లు, కొండేపాటి గోపీరాజుకు 7, చెల్లని ఓట్లు 3 పోలయ్యాయి.
- వరగానిలో గూడూరు వీరయ్య చౌదరి 8 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఆయనకు 108, కట్టా సురేష్‌బాబుకు 100, నోటాకు 2 ఓట్లు పోలయ్యాయి.

రెండు వార్డుల్లో వైఎస్సార్ సీపీ ఏకగ్రీవం

గుంటూరు రూరల్: మండలంలోని రెండు పంచాయతీ వార్డుల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికై విజయ దుందుభి మోగించారు. మండల ఎన్నికల అధికారి కె. రమేష్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం... చల్లావారిపాలెంలో ఐదో వార్డుకు చల్లా వెంకటరెడ్డి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు చెప్పారు. ఓబులునాయుడుపాలెంలో ఎనిమిదో వార్డుకు పాత్తూరు విక్టోరియా ఒకే నామినేషన్ దాఖలు చేయగా ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు డిక్లరేషన్ పత్రాల్ని అందజేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు.

పోటాపోటీగా వార్డు మెంబర్ల ఎన్నికలు

- తోట్లపాలెం-1 వార్డు మెంబరుగా మీనా, గుండవరం-3 వార్డు మెంబరుగా బాజి ఎన్నిక
- శలపాడు-1వ వార్డు మెంబరుగా రాంబాబు ఏకగ్రీవం



గుండవరంలో ఓటుహక్కు వినియోగించుకుంటున్న ఓటర్లు

చేబ్రోలు: మండలంలోని తోట్లపాలెం, గుండవరం గ్రామాల్లో రెండు వార్డు మెంబర్ల ఉప ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. చేబ్రోలు మండలంలో మొత్తం మూడు గ్రామాల్లో మూడు వార్డు మెంబర్లకు అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చారు. శలపాడు-1వ వార్డు మెంబరుగా మొగిలిపాలెం రాంబాబు ఒక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు అధికారులు ప్రకటించారు. ఎన్నికల అధికారి జి. శ్రీనివాసరావు రాంబాబుకు డిక్లరేషన్ అందజేశారు.

- తోట్లపాలెం-1వ వార్డుకు, గుండవరం-3వ వార్డుకు జరిగిన ఉపఎన్నికలు పోటాపోటీగా జరిగాయి. దీనిలో తోట్లపాలెం-1 వార్డు మెంబరుగా కఠివరపు మీనా 9 ఓట్ల మెజార్టీతో విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి ఎం. లక్ష్మీనారాయణ ప్రకటించి డిక్లరేషన్ అందజేశారు. తోట్లపాలెం -1 వార్డు మెంబరుకు మొత్తం 91 ఓట్లకు గాను 75 ఓట్లు పోలయ్యాయి. దీనిలో విజయం సాధించిన కఠివరపు మీనాకు 42 ఓట్లు, సమీప ప్రత్యర్థి గుంజి శివపార్వతికి 33 ఓట్లు వచ్చాయి. దీంతో 9ఓట్లతో మీనా గెలుపొందింది.
- గుండవరం-3వ వార్డు మెంబరుకు జరిగిన ఉప ఎన్నికల్లో గుంటూరు శివకుమార్‌కు 15 ఓట్ల మెజార్టీతో విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి ఎం. వెంకటేశ్వర్లు ప్రకటించి డిక్లరేషన్ అందజేశారు. గుండవరం వార్డు మెంబరు ఎన్నికకు మొత్తం 179 ఓట్లకు గాను 159 ఓట్లు పోలయ్యాయి. దీనిలో విజయం సాధించిన గుంటూరు శివకుమార్‌కు 87 ఓట్లు , సమీప ప్రత్యర్థి గుంటూరు బాజీకి 72 ఓట్లు వచ్చాయి.

ఉప ఎన్నికలకు భారీ బందోబస్తు

రెండు గ్రామాల్లో పంచాయతీ మెంబర్ల ఉప ఎన్నికల కోసం పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. పొన్నూరు రూరల్ సీఐ పి. ప్రభాకరరావు, స్థానిక ఎస్ఐ కె. ఆనంద్ పర్యవేక్షించారు. ఎన్నికల విధుల్లో ఎంపీడీవో బి. బాబూరావు, రూట్ ఆఫీసర్ జి. శ్రీనివాసరావు, జోనల్ ఆఫీసర్ సుబ్బారావు, మండలాధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గుండవరం-3వ వార్డు మెంబరుగా బాజీకి డిక్లరేషన్ అందజేత



శలపాడు-1వ మెంబర్‌గా రాంబాబుకు డిక్లరేషన్ ..



తోట్లపాలెం-1 వార్డు మెంబరుగా మీనాకు డిక్లరేషన్..

ఎన్‌ఎస్‌ఎస్‌తో సామాజిక స్పృహ, నాయకత్వ లక్షణాలు



ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులతో ప్రిన్సిపాల్ మనోహర్, సుధీర్ కుమార్, జయశైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రత్యేక శిబిరాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో సామాజిక స్పృహ, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.బి.పి. మనోహర్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ విద్యార్థులు దత్తత గ్రామమైన చల్లావారిపాలెంలో వారం రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక శిబిరానికి ఏఎన్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగం ప్రశంసా పత్రాలు అందజేసింది. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మనోహర్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్‌లో చేరడం వల్ల విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక అంశాలు తెలుస్తాయని చెప్పారు. తన గురించే కాకుండా సమాజం, దేశం గురించి ఆలోచన పెరుగుతుందని తెలిపారు. కళాశాలను పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా, ప్రజల్లోకి వెళ్లి సామాజిక అంశాలపై అవగాహన కలిగించి, వారిని చైతన్య వంతులుగా చేసే విధంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. యూనివర్సిటీ ఇచ్చే సర్టిఫికెట్లకు ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో కోటా ఉంటుందని తెలిపారు. ఇటువంటి అవకాశాల్ని విద్యార్థులు వినియోగించుకుని జీవితాల్లో ఉన్నతస్థితికి చేరుకోవాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా జాతీయ సేవా పథకం నిర్వహణ అధికారి డాక్టర్ జె.వి.సుధీర్ కుమార్, కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి ఆర్. జయ శైలజ, వలంటీర్లు పాల్గొన్నారు.

'చలపతి'లో ముగిసిన వృత్తి నైపుణ్య శిక్షణ

గుంటూరు రూరల్: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక నైపుణ్యతల్ని అందిపుచ్చుకోవాలని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ సూచించారు. నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో వారం రోజులుగా కళాశాల, సైప్రో సెక్యూరిటీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వృత్తి నైపుణ్య శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలతో పాటు అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని సూచించారు.

దేశ రక్షణలో యువత భాగస్వాములు కావాలి

గుంటూరు ఎడ్యుకేషన్: యువత దేశ రక్షణలో భాగస్వాములు కావాలని ఎన్‌సీసీ 25 ఆంధ్ర బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ సీఎస్ సిద్ధు సూచించారు. హిందూ ఫార్మసీ కళాశాలలో శనివారం అగ్నివీర్ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కల్నల్ సిద్ధు మాట్లాడుతూ త్రివిధ దళాల్లో ప్రవేశించాలనే యువతకు అగ్నివీర్ చక్కటి అవకాశాన్ని కల్పిస్తోందని చెప్పారు. దేశ రక్షణలో పాలుపంచుకునేందుకు, అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనాలని ఆయన కోరారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ యవత సైన్యంలో చేరి, దేశానికి సేవ చేయడం వల్ల తృప్తి పొందవచ్చని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదన రావు, ప్రిన్సిపాల్ ఎం.వి.నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ కె.రవికుమార్, ఓఎస్డీ పి. సీతారామయ్య, ఎన్‌సీసీ ఏఎన్‌వో అజీల్ బాబు, ఎస్.ఎం విజయ్ మోహిత్, నేవీ కమాండర్స్, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

పెదకాకాని: అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై. నేతాజీ ప్రభుత్వాన్ని కోరారు. అంగన్‌వాడీ పోరు యాత్ర శనివారం పెదకాకాని చేరుకుంది. ఈ సందర్భంగా యాత్ర నుద్దేశించి జరిగిన సభలో నేతాజీ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి దీప్తి మనోజా మాట్లాడుతూ మినీ సెంటర్లను మెయిన్‌గా మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు.

వజ్రోత్సవ వేడుకలు ప్రారంభం



గుంటూరు రూరల్: నల్లపాడులోని లయోలా స్కూల్ 60 వసంతాల వజ్రోత్సవ వేడుకల్ని శనివారం కడప, గుంటూరు బిషప్ గాలి బాలి ప్రారంభించారు.విశాఖ బిషప్ డాక్టర్ మల్లవరపు ప్రకాష్ దివ్యబలి పూజ నిర్వహించారు. అనంతరంబిషప్ గాలి బాలి మాట్లాడుతూ పాఠశాలను నెలకొల్పిన రెవరెండ్ ఫాదర్ యద్దనపూడి పాపయ్య సంకల్ప బలం, నేడు పాఠశాల నిర్వహణలో కనిపిస్తోందని తెలిపారు. ప్రొవెన్షియల్ ఆఫ్ ఆంధ్ర, తెలంగాణ జెస్యూట్స్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ కె. అబ్రహాం స్టెనిసెల్స్ లయోలా పాఠశాల ఘనకీర్తిని కొనియాడారు. లయోలా సుపీరియర్ కరస్పాండెంట్ ఫాదర్ డాక్టర్ పోతిరెడ్డి అంథోని మాట్లాడుతూ పాఠశాల దినదినాభివృద్ధి చెందేందుకు ఎంతోమంది క్రైస్తవ మత గురువులు సేవల్ని అందించారని తెలిపారు. పాఠశాల ఉన్నతికి కృషి చేసిన పూర్వ క్రైస్తవ మత గురువుల్ని ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ బి. సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ పి.నరేష్ సన్మానించారు.